క్లుప్తంగా

పశు వ్యాధులతో అప్రమత్తం



మందులు అందిస్తున్న భానుప్రసాద్

పాలసముద్రం: ప్రస్తుత సీజన్‌లో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి భానుప్రసాద్ తెలిపారు. శనివారం క్రిష్ణజమ్మపురంలో శ్రీజ మహిళా మిల్క్ కంపెనీ సూపర్‌వైజర్ మారీ ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 55 పాడి పశువులకు వైద్యపరీక్షలు చేసి పిరుదు మందులు పిచికారీ చేశారు. పాడి రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి కేజే దంపతుల సస్పెన్షన్



కేజే కుమార్ దంపతులు

నగరి : పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ కేజే శాంతి, కేజే కుమార్ దంపతులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు కేజే భరత్ ప్రకటించారు. పార్టీ ఆశయాలకు, సిద్ధాంతాలకు విరుద్ధంగా పనిచేసినట్లు ఫిర్యాదు అందిందని క్రమశిక్షణ కమిటీ పరిశీలన మేరకు వారిపై వచ్చిన అభియోగాలు వాస్తమని తేలడంతో పార్టీ నుంచి వారిని తొలగిస్తూ వారి సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలియజేశారు. ఇకపై వారికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఆర్‌ఎంపీ క్లినిక్స్ తనిఖీ

విజయపురం: తమ స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని అర్హతకు మించి చికిత్స చేస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బంది హెచ్చరించారు. శనివారం డాక్టర్ సోమశేఖర్ ఆదేశం మేరకు పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆర్‌ఎంపీ క్లినిక్స్‌ను వైద్య సిబ్బంది తనిఖీ చేశారు. గాయాలతో వచ్చిన వ్యక్తికి కట్టు కట్టి హాస్పిటల్‌కి పంపడం, రోగులకు ఫస్ట్‌ఎయిడ్ చేయడం వరకే పరిమితం కావాలని, జ్వరం, ఇతర కారణాలతో వచ్చిన వారికి సొంత ట్రీట్‌మెంట్, ఇంజెక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడానికి ఆర్‌ఎంపీలకు అర్హత లేదన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నిర్మూలన



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నిర్మూలించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శనివారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ ఈనెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 1–19 ఏళ్ల మధ్య వయసుగల వారందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ 400 మాత్రలు వేస్తారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ మురళి, సుశీల, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవితను కాలరాస్తోన్న ప్రభుత్వం



వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం అంటే మధ్య తరగతి విద్యార్థుల నెత్తిన పిడుగు పడినట్లే. డాక్టర్ కావాలని రేయింబవళ్లు చదువుతున్న విద్యార్థుల ఆశలను ప్రభుత్వం వమ్ము చేస్తోంది. ఇక వారి కష్టానికి ఫలితం దక్కుతుందో, లేదో అనేది తెలియని పరిస్థితి. సీట్లు వద్దని ప్రభుత్వమే లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉంది. ఏ ప్రభుత్వమైనా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సీట్లు పెంపుకోసం కృషి చేస్తాయి. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తూండడం ఎంతమాత్రమూ సరికాదు. డాక్టర్ కావాలనే కలలు కంటున్న విద్యార్థుల భవితను కాలరాస్తోంది.

–కీర్తన, కలియంబాకం, విజయపురం



వైద్య విద్య ఇక అందని ద్రాక్షేనా..?



మాది సామాన్య రైతు కుటుంబం. ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం. మా కుటుంబం నన్ను మెడిసిన్ చదివించాలనే ఆలోచనతో ఉంది. అందుకే ఓ ప్రైవేటు కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. ప్రభుత్వ కాలేజీలో సీటు సాధించాలన్నదే నా తపన. ఇప్పుడు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే మాలాంటి పేద కు టుంబాల పిల్లలకు వై ద్య విద్య అందని ద్రా క్ష అయ్యే ప్రమాదం ఉంటోంది. మెడిసిన్ చేయాలనుకునే నా లాంటి వారి ఆశలకూటమి ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి.

–మాధవి, విజయపురం

సంపూర్ణ పోషకాలు తప్పనిసరి

- తల్లులు, చిన్నారుల ఆరోగ్య రక్షణకు చర్యలు
- నెలాఖరు వరకు పౌష్టికాహార వారోత్సవాలు



పౌష్టికాహారంపై గర్భవతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

విజయపురం : పోషకాహారం ప్రాధాన్యం తెలియక, సరిగ్గా తీసుకోక తల్లులు, పిల్లలు పలు రుగ్మతలకు గురవుతున్నారు. తీసుకునే ఆహారంలో సరైన మోతాదులో మాంసకృత్తులు లేకపోవడం, విటమిన్లు, ఖనిజ లవణాల లోపాల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. కాల్షియం తక్కువైతే ఎముకల్లో పటుత్వం తగ్గుతుంది. పోషకాహార లోపం నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రధానంగా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. దీనిపై ఏటా సెప్టెంబర్‌లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించడం పరిపాటి. నగరి నియోజకవర్గంలో కూడా ఈ కార్యక్రమాల నిర్వహణతో అవగాహన కల్పిస్తున్నారు.

ఆకుకూరలే శ్రీరామరక్ష

గర్భిణులు, బాలింతలకు తాజా కూరగాయలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటిని నిర్లక్ష్యం చేయడం వల్లే తల్లులు, పిల్లలు, పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. దీనికి తోడు పప్పు దినుసులు, పాలు, గుడ్లు, పండ్లు, పండ్ల రసాలతో పాటు మాంసాహారాన్ని తీసుకోవాలి. ప్రధానంగా పప్పు దినుసులు తీసుకుంటే హార్మోన్ల సమతుల్యతను కాపాడే శక్తి పెరుగుతుంది. కూరగాయలు, ఆకుకూరల్లో సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయి. వారంలో మూడు రోజుల పాటు విధిగా తీసుకోవాలి. అలాగే సీజనలో లభించే పండ్లు తీసుకుంటే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారుల తల్లులు తప్పక పోషకాహారం తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహారం

నగరి నియోజకవర్గంలో నగరి, విజయపురం, నింద్ర ఈ మండలాల్లోని 186 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 202 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో గర్భిణులు 1256, బాలింతలు 1366, ఆరు నెలలలోపు పిల్లలు 3262, మూడేళ్లలోపు పిల్లలు 2632, ఆరేళ్లలోపు పిల్లలు 123 మంది ఉన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహార లోపం నివారణకు కోడిగుడ్లు అందజేస్తున్నారు. నెలకు 25 కోడిగుడ్లు, 2.5 కేజీల బాలామృతం ప్యాకెట్, 2.5 లీటర్ల పాలు పంపిణీ చేస్తున్నారు. అలాగే బాలింతలు, గర్భిణులకు నెలకు మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్ ప్యాకెట్, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతోపాటు రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల చిక్కీలు అందజేస్తున్నారు. బరువు తక్కువ ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు అదనంగా ఫీడింగ్ ఇస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఎలాంటి ఆహారం తీసుకుంటే పోషకాలుంటాయనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పోషక పదార్థాలను తయారు చేసి ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. సామాన్య, మధ్య తరగతి ప్రజలు తమ బడ్జెటు అనుగుణంగా రోగనిరోధక శక్తిని పెంచే పోషకాహారాలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారు.

లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విజయపురం.

విజయవంతం చేయాలి

పోషకాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని, తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వారోత్సవంలో వివరిస్తున్నాం. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని, ఉడికించిన కోడిగుడ్లు ఇస్తున్నాం. అలాగే పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని కూడా అందజేస్తున్నాం.

కృష్ణవేణి, సీడీపీఓ, నగరి

భక్తిప్రపత్తులతో గ్రామ దేవతల ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో పొన్నియమ్మ

నగరి : మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో గ్రామదేవతలు పొన్నియమ్మన్, పిల్లయార్ గుడి పొన్నియమ్మన్ దేవతల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన అలంకరణలో దేవతల ఊరేగింపు ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. బాజా భజంత్రీలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణల నడుమ ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మంగళహారతులు పట్టారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకత ఆకర్షణగా నిలిచాయి.



ప్రత్యేక అలంకరణలో పిళ్లయార్‌గుడి పొన్నియమ్మ

రోడ్డు తవ్వేస్తున్నా పట్టించుకోరా..?



గంగమాంబపురం రోడ్డును తవ్వేస్తున్న దృశ్యం

విజయపురం: బుగ్గఅగ్రహారం మీదుగా విజయపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును ఓ ప్రైవేటు సంస్థ ఇష్టారాజ్యంగా తవ్వేస్తోంది. ఏడాది క్రితం రూ. 2కోట్లతో బుగ్గకాలువ నిర్మించారు. అలాగే ఉపాధి హామీ కింద రోడ్డుకు ఇరువైపులా 150 గుంతలు తవ్వారు. వాటన్నిటినీ పూడ్చేసి, రోడ్డును తవ్వేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులైనా దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వెదురుకుప్పం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎం సుధ అన్నారు. శనివారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొమ్మన్‌దొడ్డ గ్రామంలో వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతోనే వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ఆశావర్కర్ కొత్తపల్లె సుమతి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే జాతర విజయవంతం

నగరి : నగరి గంగజాతర ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతం కావడం వెనుక జాతర కమిటీ, ప్రజాప్రతినిధులు, ప్రజలు, వాహనదారులు అందించిన సహకారం వలనే సాధ్యమైందని సీఐ మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరి గంగ జాతర అంటే గొడవలు లేకుండా జరగదనే ఒక నానుడి ఉండేదని, అయితే ప్రస్తుతం జాతర ఇంత ప్రశాంతంగా ముగియడానికి అందరూ తనకు అందించిన సహకారమే కారణమన్నారు. మూడు రోజుల పాటు ట్రాఫిక్ నిబంధనలు విధించినా ప్రజలు అర్థం చేసుకుని నడచుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



మాట్లాడుతున్న పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగుచేసి అందులో వస్తున్న బెల్లాన్ని టీటీడీ తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. గ్రామ సంఘసభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 165 కేసుల పరిష్కారం





నగరి, పుత్తూరు లోక్ అదాలత్‌లలో కేసుల విచారణ చేస్తున్న జడ్జి గోపాలకృష్ణ, జడ్జి రాఘవేంద్ర

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 165 కేసులు పరిష్కరించి రూ. 49.61 లక్షలకు రాజీ చేశారు. జడ్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. పలు సివిల్, బ్యాంకు కేసులు, ఎన్‌ఐ యాక్ట్, ఐపీసీ, పీఎల్‌సీ, ఎస్టీసీ కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 165 కేసులు పరిష్కారానికి గుర్తై రాజీ అయ్యాయి. కార్యక్రమంలో ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో 441 కేసులు..

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 441 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్‌సీ. రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల నడుమ రూ.1,83,74,791 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 387 క్రిమినల్ కేసులు, 32 సివిల్, 22 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ. రాఘవేంద్రతోపాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు పురుషోత్తం, గురునాథం, రామమూర్తి, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



కేసుల పరిష్కారం కోసం వేచి ఉన్న కక్షిదారులు

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం



- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథోత్సవం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తిపరవశంలో మునిగిపోయారు. కోలాటాలు, డప్పువాయిద్యాలు, నయాండి, లంబాడి, చెక్క భజనలు అలరించాయి. అలాగే స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా గానాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అన్నదానం...

రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఇందులోభాగంగా స్థానికులు, దాతలు అన్నదానానికి ముందుకొచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.

















తాగునీటి సమస్య పరిష్కారం



బోరు నుంచి ఉబుకుతున్న నీళ్లు

వెదురుకుప్పం: జిల్లా పరిషత్ నిధులతో మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మాంబేడు ఆదిఆంధ్రవాడలో కొంతకాలంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈనేపథ్యంలో జెడ్పీటీసీ స్పందించి జెడ్పీ నిధులతో కొత్తగా బోరు మంజూరు చేయించారు. గురువారం రాత్రి బోరు వేయగా నీళ్లు పుష్కలంగా పడ్డాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మాంబేడు సర్పంచ్ కవిత, ఎంపీటీసీ గుణశేఖర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



చంద్రకళను సత్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యాభివృద్ధికి అందించిన ఉత్తమ సేవలకుగాను తెలుగు అధ్యాపకురాలు చంద్రకళకు డా.సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశారు. తిరుపతిలో యువతేజం ట్రస్ట్, కళాం విజన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేశారు. విద్యార్థుల అభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమాలు చేసిన చిత్తూరుకు చెందిన తెలుగు అధ్యాపకురాలు (వే ఫౌండేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు)కు పురస్కారం, జ్ఞాపికను అందజేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డా.సుబ్రహ్మణ్యశర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందకరమన్నారు. ఈ పురస్కారం తనలో మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఆమెను పలువురు అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.